సాక్షి కామారెడ్డి

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



సాగునీరు అందేనా?

నిజాంసాగర్ పంటకాలువలు అధ్వానంగా ఉన్నాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం కష్టంగా మారింది.

- 10లో ▸



శబరి మాత ఉత్సవాలు..

తాడ్వాయిలోని శబరి మాత ఆశ్రమంలో వార్షిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
26.7 /7.6

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

17 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న డిసెంబర్ నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ మంగళవారం వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ముందుగా ఈనెల 15వ తేదీ వరకే బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

సోయా రైతుల రాస్తారోకో



బిచ్కుంద: మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన 1,200 బస్తాల సోయాలు ఆదివారం గోదామునుంచి వెనక్కి వచ్చాయి. దీంతో రైతులు సొసైటీకి చేరుకుని రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధికారులు పరిశీలించి వారం రోజుల క్రితం సోయా తూకం వేసి బోధన్‌లోని గోదాముకు పంపించారన్నారు. అక్కడి అధికారులు సోయాలను పరిశీలించి నల్లగా, నాణ్యత లేకుండా ఉన్నాయని చెబుతూ 1,200 బస్తాలను వెనక్కి పంపించారని పేర్కొన్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను కొనుగోలు చేస్తామని చెప్పిన సర్కారు.. ఇలా వెనక్కి పంపించడం సరికాదన్నారు. షరతులు లేకుండా సోయాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మురళి



మోర్తాడ్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన రొక్కం మురళిని నియమిస్తూ వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులను జారీ చేశారు. గతంలో డైరెక్టర్‌గా కొనసాగిన సంజీవరెడ్డి దొన్కల్‌కు చెందిన వారు కావడం గమనార్హం. మరోసారి ఈ పదవి మోర్తాడ్ మండలానికే దక్కడం విశేషం. రైతుగా, సీడ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన ఉన్న మురళిని విత్తనాభివృద్ధి సంస్థకు డైరెక్టర్‌గా ఎంపిక చేయడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో పరుచుకున్న పొగ మంచు

వణికిస్తున్న చలి

- పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- జుక్కల్‌లో అత్యల్పంగా 7.6 డిగ్రీలు నమోదు
- జిల్లా అంతటా పెరిగిన చలి తీవ్రత

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాను చలి పులి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో జనం ఇబ్బందిపడుతున్నారు. జుక్కల్‌లో అత్యల్పంగా కనిష్ట ఉష్ణోగ్రత 7.6 డిగ్రీలుగా నమోదయ్యింది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. చలి పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, అస్తమా పేషెంట్లు చలితీవ్రతతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. మొన్నటి దాకా తుపాన్ ప్రభావంతో చలి తగ్గి కాస్త రిలీఫ్ అయిన ప్రజలు.. రెండు, మూడు రోజుల నుంచి తిరిగి ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ఇబ్బందిపడుతున్నారు. ఉదయమే వ్యవసాయ పనులకు వెళ్లేవారితోపాటు ఇతర పనులు చేసుకునేవారు చలితో వణుకుతున్నారు. ఉదయం 9 గంటలవరకు మంచు కురుస్తోంది. శీతల గాలులు వీస్తున్నాయి. ఎండ వచ్చినా చలి తీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం 5 గంటలకే చలి తీవ్రత పెరుగుతోంది. పొద్దున, సాయంత్రం చలిమంటలు కాచుకుంటూ చలినుంచి ఉపశమనం పొందుతున్నారు.



పెద్దకొడప్‌గల్‌లో చలి కాచుకుంటున్న ప్రజలు

జిల్లాలో ఆదివారం నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతల వివరాలు..

లొకేషన్	మండలం	కనిష్టం (డిగ్రీల్లో)	లొకేషన్	మండలం	కనిష్టం (డిగ్రీల్లో)	లొకేషన్	మండలం	కనిష్టం (డిగ్రీల్లో)
			సర్వాపూర్	గాంధారి	9.9	పాతరాజంపేట	కామారెడ్డి	10.9
జుక్కల్	జుక్కల్	7.6	దోమకొండ	దోమకొండ	10.0	బీబీపేట్	బీబీపేట్	11.3
మేనూర్	మద్నూర్	8.9	నాగిరెడ్డిపేట	నాగిరెడ్డిపేట	10.0	రామలక్ష్మణ్‌పల్లి	గాంధారి	11.4
బిచ్కుంద	బిచ్కుంద	9.2	మగ్దుంపూర్	నిజాంసాగర్	10.1	పెద్దకొడప్‌గల్	పెద్దకొడప్‌గల్	11.4
బీర్కూర్	బీర్కూర్	9.2	లింగంపేట్	లింగంపేట్	10.2	హసన్‌పల్లి	నిజాంసాగర్	11.4
బొమ్మన్‌దేవ్‌పల్లి	నస్రుల్లాబాద్	9.5	లచ్చాపేట్	మాచారెడ్డి	10.2	సోమూర్	మద్నూర్	11.5
నస్రుల్లాబాద్	నస్రుల్లాబాద్	9.6	రామారెడ్డి	రామారెడ్డి	10.2	అర్గొండ	రాజంపేట	12.2
ఎల్పుగొండ	పాల్వంచ	9.7	కొల్లూరు	బాన్సువాడ	10.4	భిక్కనూరు	భిక్కనూరు	12.6
గాంధారి	గాంధారి	9.7	మాచాపూర్	ఎల్లారెడ్డి	10.4	సదాశివనగర్	సదాశివనగర్	13.1
పిట్లం	పిట్లం	9.8	ఇసాయిపేట్	పాల్వంచ	10.5	తాడ్వాయి	తాడ్వాయి	14.1
పుల్కల్	బిచ్కుంద	9.9	దోంగ్లీ	దోంగ్లీ	10.8	కలెక్టరేట్	కామారెడ్డి	15.1

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

- ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లాలో 1,730 ఎకరాల్లో సాగు



జల్దిపల్లిలో సాగవుతున్న ఆయిల్‌పామ్

లింగంపేట: ఆయిల్‌పామ్ పంట సాగును సర్కారు ప్రోత్సహిస్తోంది. సబ్సిడీపై మొక్కలతోపాటు డ్రిప్ ఇరిగేషన్ సిస్టం అందిస్తోంది. జిల్లాలో పండ్ల తోటలు, కూరగాయల పెంపకానికి కోతులు, అడవి జంతువుల బెడద ఉన్నందున రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లాలో ఈ పంట సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో 1,730 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పంట సాగు విస్తీర్ణాన్ని 2 వేల ఎకరాలకు పెంచాలన్న లక్ష్యంతో అధికారులున్నారు.

సబ్సిడీపై మొక్కలు..

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు 90 శాతం డ్రిప్పు సబ్సిడీ ఇస్తున్నారు. ఆయిల్‌పామ్ మొక్క ధర రూ. 197 ఉండగా రూ. 20కే రైతుకు అందిస్తున్నారు. ఎకరాకు 50 మొక్కలు నాటుతారు. ఎకరాకు గరిష్టంగా రూ. 9,600 సబ్సిడీ లభించనుంది. అలాగే ఎరువుల యాజమాన్యం, నిర్వహణ కోసం ఏటా రూ. 4,200 అందిస్తుంది.

మూడేళ్లనుంచి పంట చేతికి..

ఆయిల్‌పామ్ పంట మూడు నుంచి నాలుగు సంవత్సరాల్లో చేతికి వస్తుంది. సుమారు 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తూనే ఉంటుంది. ఈ క్రమంలో మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు ఎకరాకు 6 టన్నుల దిగుబడి వస్తుంది. ఎనిమిదో సంవత్సరంనుంచి ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. ఆయిల్‌పామ్‌కు ప్రస్తుతం మార్కెట్‌లో టన్నుకు రూ. 20,000 వరకు పలుకుతోందని జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి తెలిపారు. రైతులు ముందుకు వచ్చి ఆయిల్ పామ్ మొక్కల పెంపకంతో లాభాలు గడించాలని సూచిస్తున్నారు.

అంతర పంటలతో అదనపు లాభాలు..

ఆయిల్‌పామ్‌తోపాటు అంతర పంటలూ సాగు చేసుకోవచ్చు. అంతర పంటలుగా కూరగాయలు, పూల మొక్కలు, మొక్కజొన్న, మిరప, పత్తి, అరటి, వేరు శనగ, కంది, జొన్న, శనగ, పొగాకు, సోయాబీన్, పెసర, మినుము, నువ్వులు, పశుగ్రాసాలు సాగు చేయవచ్చని ఉద్యన శాఖ అధికారులు సూచిస్తున్నారు. పంట చేతికి రాగానే కంపెనీ ప్రతినిధులు నేరుగా వ్యవసాయ క్షేత్రానికి వచ్చి పంటను కొనుగోలు చేస్తారని పేర్కొంటున్నారు. త్వరలోనే భిక్కనూరు శివారులో ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు.

మూడెకరాలలో సాగు



మూడెకరాలలో ఆయిల్ పామ్ మొక్కలు నాటాను. మొక్కలు నాటి రెండేళ్లవుతోంది. మొక్కలు ఏపుగా పెరిగాయి. అంతర పంటలు సాగు చేస్తున్నా. ఆయిల్‌పామ్ సాగు సంతృప్తికరంగా ఉంది.

– రాజు, రైతు, జల్దిపల్లి

మంచి లాభాలు వస్తాయి



ఆయిల్‌పామ్ సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ పంట సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయి. చీడపీడల బెడద చాలా తక్కువగా ఉంటుంది. రైతులు ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించాలి.

– జ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

'అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ'



మాట్లాడుతున్న రాజ్‌సాగర్

నిజామాబాద్ రూరల్: ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని, దేశంలో ఎక్కడ ఏ విద్యార్థికి సమస్య ఉన్నా పోరాటం చేస్తోందని పరిషత్ ఇందూర్ విభాగ్ సంఘటన మంత్రి రాజ్‌సాగర్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఏబీవీపీ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాజ్‌సాగర్ మాట్లాడుతూ రెండు రోజులపాటు కొనసాగిన శిక్షణ తరగతుల్లో నాలుగు జిల్లాల విద్యార్థి ప్రతినిధులు పాల్గొని, ఎన్నో విషయాలు నేర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ నరేశ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు శివకుమార్, నగర అధ్యక్షుడు వెంకటకృష్ణ, ఇందూరు జిల్లా ప్రముఖ్ ఈశ్వర్, కామారెడ్డి జిల్లా ప్రముఖ్ గిరి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌గౌడ్, నాయకులు సునీల్‌సాయి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్

- గేటు బయట స్థలాన్ని కేటాయించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు స్థలం కేటాయించకపోవడంతో ఇన్నాళ్లు మెయిన్ గేటు వద్దే ఆందోళనలు చేసేవారు. దీంతో కలెక్టరేట్‌లోని కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, అధికారులు, ప్రజలు ఇబ్బంది పడేవారు. చాలాసార్లు మెయిన్ గేటు ముందు వందలాది మంది ఆందోళనల్లో పాల్గొనడంతో గేట్‌ను మూసేసి, దూరాన ఉన్న చిన్న గేటును తెరిచేవారు. దీంతో చుట్టూరా తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఈ విషయంపై 'సాక్షి'లో కొన్నాళ్ల క్రితం 'ధర్నాలతో ఇక్కట్లు' శీర్షికన ప్రచురించిన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. ధర్నా చౌక్ కోసం పలు స్థలాలను పరిశీలించారు. చివరకు కలెక్టరేట్ బయట కాంపౌండ్ వాల్‌కు ఆనుకుని ఖాళీ స్థలం ఉండడంతో దాన్ని ఎంపిక చేశారు. అక్కడ ధర్నా చౌక్ అన్న ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో నిరసన కార్యక్రమాలకు వేదిక దొరికినట్టయ్యింది.



కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌కు కేటాయించిన స్థలం



ధర్నాలతో ఇక్కట్లు

'సాక్షి' కథనం క్లిప్పింగ్

'గ్రూప్ –2'కు సగం మంది డుమ్మా

- ఫస్ట్ పేపర్‌కు 49.12, సెకండ్ పేపర్‌కు 48.45 శాతం హాజరు
- నిమిషం నిబంధనతో వెనుదిరిగిన పలువురు అభ్యర్థులు
- నేడు మూడు, నాలుగో పేపర్లు



సాందీపని డిగ్రీ కళాశాల సెంటర్ వద్ద క్యూలో అభ్యర్థులు

కామారెడ్డి టౌన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్ –2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సిబ్బంది అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా కేంద్రంలో 19 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు సాగాయి. సగానికిపైగా అభ్యర్థులు పరీక్షలకు డుమ్మా కొట్టారు. మొత్తం 8,085 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఉదయం జరిగిన మొదటి పేపర్‌కు 3,971 మంది హాజరు కాగా 4,114 మంది గైర్హాజరయ్యారు. హాజరుశాతం 49.12 గా నమోదయ్యింది. మధ్యాహ్నం జరిగిన సెకండ్ పేపర్‌కు 3,917 మంది హాజరు కాగా 4,168 మంది పరీక్ష రాయలేదు. 48.45 శాతం హాజరు రికార్డయ్యింది. నిమిషం నిబంధనతో పలువురు అభ్యర్థులు పరీక్షకు దూరమయ్యారు. మైనారిటీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి నలుగురు, డిగ్రీ కళాశాలకు ముగ్గురు, ఎస్పీఆర్ స్కూల్‌కు నలుగురు.. ఇలా పలువురు అభ్యర్థులు నిమిషం గడువు ముగిసిన తర్వాత రావడంతో వారిని కేంద్రంలోనికి అనుమతించలేదు. దీంతో కంటతడి పెట్టుకుంటూ అభ్యర్థులు వెనుదిరిగారు. కాగా ఇద్దరు అభ్యర్థులు హాల్ టికెట్ మర్చిపోయి కేంద్రానికి వచ్చి పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. మరో నలుగురు గుర్తింపు కార్డులను వెంట తీసుకుని రాకపోవడంతో మూల్యం చెల్లించుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేసి, బందోబస్తు నిర్వహించారు. సెంటర్ల బయట మహిళా అభ్యర్థులు తమ చిన్నారులను కుటుంబ సభ్యులకు అప్పగించి పరీక్ష రాయడానికి వెళ్లారు. పరీక్షలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తోపాటు అధికారులు పర్యవేక్షించారు.



ఆర్‌కే కళాశాల సెంటర్ వద్ద గది వివరాలు చూసుకుంటున్న అభ్యర్థులు



మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ వద్దకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను తిప్పిపంపుతున్న పోలీసులు



డిగ్రీ కళాశాల సెంటర్‌కు చివరి క్షణంలో పరుగెత్తుకుంటూ వస్తున్న అభ్యర్థులు

ఉత్తమ ఫలితాలకోసం 'ప్రత్యేక' ప్రణాళిక

- ఇంటర్ విద్యార్థులకు రెండుపూటలా ప్రత్యేక తరగతులు
- తల్లిదండ్రులతో సమావేశాల నిర్వహణ



తాడ్వాయిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

నాగిరెడ్డిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 90 రోజుల ప్రత్యేక ప్రణాళికతో సాగుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో 2,500 మంది ఫస్టియర్, 2,400 మంది సెకండియర్ చదువుతున్నారు. వారికి ఈనెల ఒకటో తేదీన ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల స్థాయి ఆధారంగా గ్రూపులుగా విభజించి ప్రత్యేక తరగతుల ద్వారా వారికి బోధించనున్నారు.

ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈనెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేయాలని అధ్యాపకులకు ఆదేశాలు జారీ చేశారు. కళాశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల గురించి వారి తల్లిదండ్రులకు తెలియజేసేందుకు నెలకొకసారి పేరెంట్స్ మీటింగ్స్ నిర్వహించాలని నిర్ణయించారు. చదువులో వెనకబడినవారి సామర్థ్యాలను మరింత పెంచేందుకు ప్రత్యేక తరగతులతోపాటు వారానికి రెండు పర్యాయాలు పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకవైపు విద్యార్థులను ఇంటర్ వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తూనే మరోవైపు ఎంసెట్, నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఆలోచనలో ఉన్నారు.

మంచి ఫలితాలు సాధిస్తాం

ఇంటర్ వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వారిని సన్నద్ధం చేస్తున్నాం. ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రులతోనూ సమావేశాలు నిర్వహిస్తున్నాం. గతేడాదికంటే మెరుగైన ఫలితాలను సాధిస్తాం.

– షేక్ సలాం, డీఐఈవో

శనగ పంటలో కలుపుతీత



మద్నూర్(జుక్కల్): రబీ సీజన్‌లో వేసిన శనగ పంటలో కూలీలు కలుపు తీస్తూ బిజీగా మారారు. మండలంలోని మేనూర్, మద్నూర్, సోనాల, గోజేగావ్, అవాల్‌గావ్ తదితర ప్రాంతాల్లో రైతులు రబీలో ప్రధాన పంటగా శనగను సాగు చేశారు. చలి ఎక్కువగా ఉంటేనే పంట బాగా ఎదుగుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. పంటలో కలుపు లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మోపాల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని డీఈవో అశోక్ అన్నారు. మోపాల్ శివారులోని ప్రెసిడెన్సి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 'స్పోర్ట్స్ ద కెరీర్ ఫెయిర్' కార్యక్రమాన్ని డీఈవో అశోక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తమ పిల్లల అభిరుచిని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలికితీయాలన్నారు. విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా బోధన ఉండాలని సూచించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పవన కుమార్, మహేశ్, సురేశ్, రజ్, రవి కిరణ్, శశాంక్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు జాతీయ అవార్డు



రెంజల్: బహుజన సాహిత్య అకాడమీ 2024 సంవత్సరానికి గాను మండలంలోని సాటాపూర్ సర్పంచ్ ఎఖార్‌పాషను ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేసింది. ఆదివారం ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రమనియన్ చేతుల మీదుగా ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్నారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఉద్యమకారులు, సంఘసేవకులు, కవులు, కళాకారులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అవార్డులు అందిస్తోందని ఎఖార్‌పాష పేర్కొన్నారు. దేశంలోని 27 రాష్ట్రాల నుంచి సుమారుగా వెయ్యి మంది డెలిగేట్స్‌ను ఎంపిక చేసి అవార్డులను అందించారని వివరించారు.

17 నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఈ నెల 17 నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా క్రీడాకారులకు సీఎం కప్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న హ్యాండ్‌బాల్ జూనియర్ విభాగంలో (బాలురు, బాలికలు), 20న హాకీ (సీనియర్ మెన్), 21న తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ జూనియర్ విభాగంలో ఉంటాయని అన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, జన్మ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

బిచ్కుంద: మండల కేంద్రంలో సోమవారం మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు సాయిని అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని మున్నూరు కాపులు పార్టీలకు అతీతంగా సమ్మేళన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

దాడిలో యువకుడి మృతి

ఖలీల్‌వాడి: బైక్ పార్కింగ్ విషయంలో చోటు చేసుకున్న గొడవలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని గోశాల గేట్ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటో టౌన్ పరిధిలోని గోశాల గేటు వద్ద ఆదివారం రాత్రి పలువురు యువకుల మధ్య బైక్ పార్కింగ్ విషయంలో గొడవ జరిగింది. ఒకరికిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో గైక్వాడ్ చంద్రకాంత్(22) మురికి కాలువలో పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ వో పేర్కొన్నారు.

అందరివాడు సంతమల్లన్న

- సోమవారం జాతర, మంగళవారం నైవేద్యాలు
- అంక్సాపూర్ జాతరకు సర్వం సిద్ధం



జాతరకు ముస్తాబైన ఆలయం



గర్భగుడిలో కొలువైన ఉత్సవమూర్తి

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ సంతమల్లన్న జాతరకు స్థానిక వీడీసీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఆర్మూర్ సబ్ డివిజన్‌లో భీమ్‌గల్ శ్రీ మన్నింబాచలస్వామి జాతర తర్వాత రెండో పెద్ద జాతరగా పేరు పొందింది. జాతర కోసం ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. గ్రామస్తులతో పాటు వేలాది భక్తులకు ఆరాధ్యదైవమైన సంతమల్లన్న జాతర ప్రతి ఏడాది సుబ్రహ్మణ్య షష్ఠి తర్వాత వచ్చే రెండో సోమవారం జరుగుతుంది. సబ్‌డివిజన్ మండలాల ప్రజలే కాకుండా ఇతర జిల్లాల భక్తులు ఏడాది పాటు గా సంతమల్లన్నను కొలుస్తా రు. ప్రతి ఏటా శ్రావణమాసంలో సంతమల్లన్న దీక్ష లు పాటిస్తారు. పసుపు, ఇతర పంటలకు ప్రసిద్ధిగాంచిన అంక్సాపూర్ గ్రామస్తులు తమ పంటలను సంతమల్లన్న అనుగ్రహం వల్లే పండుతాయని విశ్వసిస్తారు. ఏడాదిలో ఎన్ని పండుగలు వచ్చినా సంతమల్లన్న జాతరనే మొదటి పండుగగా భావిస్తారు.

పురాతన కాలంలో దొరికిన విగ్రహం

పురాతన కాలంలో గ్రామస్తులు భూమి దున్నుతుండగా సంతమల్లన్న విగ్రహం దొరికింది. దీంతో పక్కనే ఉన్న గుట్టపై ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి సంత మల్లన్నగా పూజిస్తున్నారు. గుట్టపై భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. గుట్టపైకి వెళ్లేందుకు మెట్ల మార్గంతో పాటు, వెనుక వైపు ఘాట్‌రోడ్డు ఉంది. గుట్ట చుట్టూ రథోత్సవానికి సీసీ రోడ్డు నిర్మించారు. జాతరకు నలు దిక్కుల నుంచి వచ్చే భక్తులు సునాయసంగా గుట్టపైకి చేరడానికి రూ. రెండు కోట్ల ఇరవైలక్షలతో సుమారు 2 కిలోమీటర్ల బైపాస్ తారురోడ్డు నిర్మించారు.

జాతర కార్యక్రమాలు

వారం రోజుల ముందు నుంచి సంతమల్లన్న జాతర కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఉత్సవ మూర్తులతో రెండు రోజుల పాటు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శుక్రవారం విగ్రహాలను పల్లకీలో కాలినడకన తడ్‌పాకల గంగ స్నానానికి తీసుకెళ్లారు. గంగస్నానం తర్వాత తిరిగి కాలినడకన శనివారం రాత్రి గ్రామానికి చేరుకున్నారు. ఆదివారం రథాన్ని పూలతొట్టెలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం డప్పు వాయిద్యాలతో రథాన్ని గుట్టవద్దకు చేర్చారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు సంతమల్లన్నస్వామికి మాందలమ్మ, గొల్లకేతమ్మతో కల్యాణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం సంప్రదాయ పూజలు, బలిహరణం తర్వాత భాజాభజంత్రీలు, డప్పులతో గుట్ట చుట్టూ మూడు సార్లు రథోత్సవం చేపడతారు. మంగళవారం భక్తులు నైవేద్యాలు సమర్పిస్తారు. దీంతో జాతర కార్యక్రమాలు ముగుస్తాయి. అనంతరం గ్రామంలో జాతర కొనసాగుతుంది.

ఆధ్యాత్మికం

దత్తాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే సురేందర్ పూజలు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణ శివారులోని దత్తాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం పూజలు నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా దత్తాశ్రమంలో పూజలు చేశారు. అనంతరం ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు తులసి, బీఆర్‌ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, సతీష్, కౌన్సిలర్ రాము, ఇమ్రాన్, అరవింద్ తదితరులున్నారు.

షిర్డీసాయి ఆలయంలో..



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి శ్రీషిర్డి సాయి ఆలయంలో దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బాల్‌రాజు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మల్లన్న ఉత్సవాలు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం బస్వాపూర్‌లో మల్లన్న ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా హనుమాన్ ఆలయం నుంచి మల్లన్న దేవాలయం వరకు ఒగ్గు డోలు, భజనలతో కుర్మ కులస్తులు బోనాల ఊరేగింపు జరిపారు. మాజీ సర్పంచులు రవి పటేల్, సురేష్ గౌండ, రఘు గౌండ, ఏక్‌నాథ్, మల్లికార్జున్, రామ్‌గౌండ తదితరులున్నారు.



గీతా హోమం, పూజలు



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రం శివారులోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వేద పండితుడు సంజీవ్‌రావ్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, గీతా హోమం ఘనంగా నిర్వహించారు.

పుణ్యతిథి మహోత్సవం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని బండాయప్ప మఠంలో ఆదివారం శ్రీ సద్గురు బండాయప్పస్వామి పుణ్యతిథి మహోత్సవం నిర్వహించారు. మఠం పీఠాధిపతి శ్రీ సోమాయప్ప స్వామి పూజలు చేశారు. స్వామి సమాధికి రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ సోమయప్ప స్వామి మాట్లాడుతూ.. దైవభక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం అన్నదానం చేశారు.



భక్తిశ్రద్ధలతో ఘనంగా శ్రీనవదుర్గ వ్రతం



కామారెడ్డి అర్బన్: పౌర్ణమి సందర్భంగా స్థానిక తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శారదామాత ఆదిశంకర ఆలయంలో ఆదివారం నవదుర్గ సామూహిక వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి అమ్మవారికి ఎంతో ప్రీతికరమైందని, నవదుర్గ అమ్మవార్లకు వ్రతం చేయడం ద్వారా పూర్తి ఆశీస్సులు లభిస్తాయని వేదపండితులు జి. ఆంజనేయశర్మ అన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

రాజంపేట: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ప్రతి నెలలో పౌర్ణమి రోజున ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పూజారి గౌరీనాథ్, చిన్నసిద్దరాములు, శ్రీనివాస్, సుభాష్‌రెడ్డి ఉన్నారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



మంజుల(ఫైల్)

తాడ్వాయి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ యువతి మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలం చిట్యాలలో చోటు చేసుకుంది.ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రుల మంజుల(26)జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది.కొన్ని రోజులుగా ఆమె కడుపు నొప్పితో పాటు దంతాల సమస్యలతో బాధపడుతోంది. శనివారం ఉదయం ఇంటి నుంచి విధులు నిర్వహించే ఆస్పత్రికి వెళ్లిన ఆమె మధ్యాహ్నం అనారోగ్య సమస్యలతో ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.వ్యవసాయ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి మంజుల ఉరేసుకొని కనిపించింది. తండ్రి కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సైపేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరు..

నవీపేట: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నవీపేట మండలంలోని మట్టయ్యఫారంలో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేదావత్ పీర్‌చంద్(35) ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అప్పు చేసి దుబాయికి వెళ్లాడు. అక్కడ సరైన ఉపాధి దొరకక పోవడంతో ఐదేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. నాటి నుంచి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడేవాడు. శనివారం రాత్రి పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



చిన్న సాయిలు మృతదేహం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామ చెరువులో శనివారం గల్లంతైన కోటగిరి మండలం కొత్తపల్లికి చెందిన గేదెల కాపరి చిన్నసాయిలు (40) మృతదేహం ఆదివారం లభ్యమైంది. స్థానిక జాలరుల చేత గాలింపు చర్యలు చేపట్టగా నీట మునిగిన చోటే మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై రజనీకాంత్ పేర్కొన్నారు.

టేకు దుంగల పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలోని వెల్లుట్లలో అక్రమంగా దాచి ఉంచిన టేకు దుంగలను కామారెడ్డి అటవీశాఖ ప్రత్యేక బృందం అధికారులు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎఫ్‌డీవో రామకృష్ణ ఆదివారం తెలిపారు. వెల్లుట్లలో అక్రమంగా టేకు దుంగలు దాచి ఉంచారన్న సమాచారం మేరకు కామారెడ్డి బృందం దాడులు చేయగా గ్రామంలోని పైడాకుల నర్సింలు అనే వ్యక్తి ఇంట్లో దాచి ఉంచిన 50 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. నర్సింలుపై అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌డీవో పేర్కొన్నారు.

కల్లెడిలో చోరీ



మాక్లూర్: మండంలోని కల్లెడి గ్రామంలో చోరీ జరిగినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భజనమండలి గంగుబాయి శనివారం రాత్రి ఇంటికితాళం వేసి గ్రామ శివారులోని ఆశ్రమానికి భజన కోసం వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించింది. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న రూ. 16 వేల నగదు, తులంన్నర వెండి చోరీ గురైనట్లు బాధితురాలు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎడపల్లిలో బైక్..

ఎడపల్లి: మండల కేంద్రంలో ఓ బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల హన్మండ్లు ఎడపల్లి మండల కేంద్రంలోని ఆకుల శ్రీనివాస్ పొలంలో పని నిమిత్తం వచ్చాడు. అతను తన బైక్‌ను గురుకుల పాఠశాల సమీపంలో ఉదయం ఉంచాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రారంభమైన శబరిమాత ఉత్సవాలు

- కనుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం
- తరలివచ్చిన భక్తులు



ఆశ్రమంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో ఆదివారం 54వ వార్షిక మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 4 గంటలకు సుప్రభాత ధ్యానం, గురుగీత, గురుచరిత పారాయణం, గోమాత, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలను ఆశ్రమ నిర్వాహకులు చేపట్టారు. ఆయా జిల్లాల నుంచి 300మంది భక్తులు ఆశ్రమానికి కాలినడకన వచ్చారు. ఉదయం ఆశ్రమం నుంచి భక్తులు భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు చేపట్టి భిక్షాటన చేశారు. మధ్యాహ్నం 12గంటలకు ఆశ్రమంలో వేద పండితులు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహాత్ములు తమ సందేశాన్ని ఇచ్చారు. శ్రీ సీతారామాంజనేయ సంవాద మహాగ్రంథ పారాయణం, శ్రీగురుగీత, గురుచరిత పారాయణం తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం దత్తాత్రేయ జయంతి సందర్భంగా డోలారోహణ కార్యక్రమం, రాత్రి ప్రధాన రహదారిపై రథోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారు జాము వరకు భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, జానపదగేయాలు, నృత్యాలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆర్టీసీ అధికారులు ఆశ్రమం వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా అరకిలోమీటరు పొడవునా రకరకాల దుకాణాలు వెలిశాయి. సీఐ సంతోష్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు, గాంధారి ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆశ్రమ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కల్యాణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ముళ్ల పొదల్లో మోడల్ రూం..!

చారిత్రక సంపద కనుమరుగు



ముళ్ల పొదల్లో ఉన్న మోడల్ రూం

బాల్కొండ: ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో తీసిన పటాలను పర్యాటకులకు తిలకించే విధంగా ఏర్పాటు చేసిన మోడల్ రూం ముళ్ల పొదల్లో మగ్గుతోంది. ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ఆనకట్ట దిగువన ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో మోడల్ రూంను నిర్మించారు. కానీ నిర్వహణ మరిచిపోవడంతో ముళ్ల పొదల్లో మగ్గుతోంది. ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన వేళ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మోడల్ రూంకు సైతం శంకుస్థాపన చేశారు. 1984లో ప్రాజెక్ట్‌లోకి భారీ వరదలు రావడంతో గోదావరిలోని 42 వరద గేట్లు ఎత్తి 16 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. దీంతో నాడు మోడల్ రూంను ఖాళీ చేసి అందులో ఉన్న పటాలను, ప్రాజెక్ట్ నిర్మాణ క్రమాలను ప్రాజెక్ట్ గెస్ట్ హౌజ్‌లోని ఓ గదిలో భద్రపరిచారు. అక్కడా గది శిథిలావస్థకు చేరడంతో ప్రాజెక్ట్ హౌజ్‌లోని ఓ గదిలో పెట్టారు. నాటి నుంచి పర్యాటకులకు చారిత్రక వివరాలు తెలియకుండానే మగ్గుతున్నాయి. ప్రస్తుతం మోడల్ రూం చుట్టూ ముళ్ల పొదలతో నిండి పోయింది. వర్షం కురిస్తే తడిసి ముద్దవుతోంది. స్వల్ప మరమ్మతులు చేపడితే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ప్రాజెక్ట్ పటాలను తీసుకొచ్చి మోడల్ రూంలో భద్ర పరిస్తే పర్యాటకులకు, భావితరాలకు ప్రాజెక్ట్ గురించి తెలిసే అవకాశం ఉంది. ఇకనైనా ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మద్నూర్‌లో అస్తమిస్తున్న సూర్యుడు

సుందరం.. సంధ్యా సమయం

ఉదయం పడిపోతున్న ఉష్ణోగ్రతలతో సూర్యుడు ఆలస్యంగా వస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో సూర్యుడు భగభగలాడుతూ.. సాయంత్రం ఎర్రగా మారి ఆకట్టుకుంటున్నాడు. మండల కేంద్రానికి సమీపంలో ఆదివారం అస్తమిస్తున్న సూర్యుడి రూపం సుందరంగా కనిపించింది.

–మద్నూర్(జుక్కల్)

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు కేసులు నమోదు చేశారు.

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ శివారులో జాతీయ రహదారిపై బైక్‌ను డీసీఎం వ్యాన్ ఢీకొన్న ఘటనలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ అద్నాన్(20) మృతి చెందాడు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన అద్నాన్ తన మిత్రుడు షేక్ ఫైసల్‌తో కలిసి నిజామబాద్ జిల్లా కేంద్రంలో పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా చిట్టాపూర్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాను ఢీకొన్నది. ఈ ఘటనలో అద్నాన్ తలకు తీవ్రగాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. వెంటనే ఆర్మూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. షేక్ ఫైసల్ గాయాలతో బయట పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరు..



సోనాజీ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సోనాజీ అలియాస్ సోమాజీ గాంధీ శామల్‌వాడ్(60) కాలువ పడి మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మహారా ష్ట్రలోని నాందేడ్ జి ల్లా షిబ్దారా గ్రామానికి చెందిన సోనాజీ పెర్కిట్‌లో కూలీ పని చేస్తూ కుటుంబతో జీవిస్తున్నాడు. శనివారం సాయంత్రం పెర్కిట్‌లో ని మట్టు కాలువలో చేపలు పడుతుండగా కాలువలో పడి మృతిచెందాడు. మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు..

నిజాంసాగర్: మండల శివారులోని పెద్దపూల్ బ్రిడ్జి వద్ద ఆదివారం కుర్మ భూమవ్వ(70) అనే మతిస్థిమితం లేని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందని భూమవ్వ ప్రతి రోజు ఇంటి నుంచి వెళ్లి రాత్రి వచ్చేది. ఈ నెల 10న అలాగే ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. పెద్దపూల్ బ్రిడ్జి పక్కన మృతదేహం ఆదివారం లభ్యమైంది. మృతురాలి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తల్లీ కుమార్తె అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని భవానీరోడ్‌లో నివాసం ఉండే తల్లీ కుమార్తె అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. కాలనీలో ఉండే చాట్ల స్వరూపకు ఆరేళ్ల క్రితం మరో కాలనీకి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవలతో కొంత కాలంగా ఆమె తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈ నెల 4న తన నాలుగేళ్ల కుమార్తెను తీసుకుని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చాలా చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. స్వరూప తల్లి సిద్ధవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.